క్లుప్తంగా

ఒంగోలు వెళ్లి పింఛను ఇచ్చి..



భట్టిప్రోలు: కోళ్లపాలెం గ్రామానికి చెందిన నీలా సుబ్బారావు అనారోగ్యంతో బాధపడుతూ ఒంగోలులో కుమారుడు ఇంటిలో ఉంటున్నారు. తుపాను ప్రభావంతో స్వగ్రామానికి రాలేని పరిస్థితి. వలంటీర్ ఎస్.రాణికి విషయం తెలియజేయడంతో..సోమవారం ఆర్టీసీ బస్సులో ఒంగోలుకు వెళ్లి.. సుబ్బారావుకు పింఛను నగదు అందజేశారు. వలంటీర్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్తగూడెం గడ్డపై కోడూరు బిడ్డ



కూనంనేని సాంబశివరావు

పిట్టలవానిపాలెం : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం సెగ్మెంట్ నుంచి నుంచి సీపీఐ అభ్యర్థిగా గెలుపొందిన కూనంనేని సాంబశివరావు మండలంలోని కోడూరు గ్రామ నివాసి. ఆయన గెలుపుతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్ల క్రితం కోడూరు నుంచి వలస వెళ్లి ఆయన కొత్తగూడెంలో స్థిరపడ్డారు. అక్కడ కొంతకాలం విశాలాంధ్ర దిన పత్రికలో విలేకరిగా పనిచేశారు. 1984లో సీపీఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శిగా పనిచేసి, 1987లో మండల ప్రజా పరిషత్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. 2004లో సుజాత నగర్ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. 2009లో కొత్తగూడెం నుంచి పోటీ చేసి తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014, 2018 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పనిచేసి, రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో శాసనసభ్యుడిగా ఎన్నికై రెండవసారి అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారు.

ప్రజా సమక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



కొల్లూరు: ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కొల్లూరు వైస్ ఎంపీపీ మురాల రాంబాబు అన్నారు. సోమవారం మండలంలోని రావికంపాడు సచివాలయం వద్ద 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలందరూ వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. సచివాలయం పరిధిలోని రావికంపాడు, బొద్దులూరుపాడు గ్రామాలలోని లబ్ధిదారులకు ప్రభుత్వం రూ. 17.93 కోట్లు సంక్షేమ పథకాల రూపంలో పంపిణీ చేసిందన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ అయిల సుబ్బారావు, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు, ఈఓపీఆర్‌డీ సీహెచ్. రవిబాబు పాల్గొన్నారు.

డ్రోన్ పైలట్ శిక్షణకు వ్యవసాయ విద్యార్థులు



బాపట్ల: వ్యవసాయ విద్యార్థులకు డ్రోన్ పైలట్ శిక్షణ ఇవ్వడానికి ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధిక ప్రాధాన్యం ఇస్తోందని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. కళాశాలకు చెందిన విద్యార్థులు ఈ శిక్షణకు ఎంపికయ్యారని తెలిపారు. గుంటూరులోని లాం నందు ఇవ్వనున్న శిక్షణ.. డీజీసీఏ ఆథరైజ్డ్ రిమోట్ పైలట్ ట్రెనింగ్ ఆర్గనైజేషన్ ఈ నెల ఐదు నుంచి 16వ తేదీ వరకు 12 రోజుల పాటు ఇవ్వనున్నట్లు తెలిపారు. డ్రోన్ ద్వారా విత్తు, ఎరువులు, పురుగు మందుల పిచికారీ చేసేందుకు శిక్షణనిస్తారని వివరించారు. పూర్తి మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపికచేయడం జరిగిందన్నారు. సంస్థాగత అభివృద్ధి ప్రణాళిక (ఐడీపీ)లో భాగంగా ఆంధ్రప్రదేశ్ సెన్సార్స్ అండ్ స్మార్ట్ అప్లికేషన్స్ రీసెర్చ్ ఇన్ అగ్రికల్చర్ (అప్సర) కేంద్రం ద్వారా ఈ శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో–ఆర్డినేటర్లు డాక్టర్ కె. చంద్రశేఖర్, డాక్టర్ వి.సీతారాం బాబు, డాక్టర్ బి.రత్నకుమారి పాల్గొన్నారు.

మిచాంగ్.. మేము సిద్ధం



రేపల్లె రూరల్: చెన్నుపల్లివారిపాలెంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్న ఎంపీడీఓ శివపార్వతీ



పిట్టలవానిపాలెం: అప్రమత్తంగా విద్యుత్ శాఖ సిబ్బంది

- ఎడతెరిపి లేని వర్షాలతో ప్రజల ఇక్కట్లు
- నేడు తీరం దాటనున్న తుపాను
- అధికారుల సుడిగాలి పర్యటనలు, పంటల పరిశీలన
- ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లలో నిమగ్నం
- అప్రమత్తమైన విద్యుత్ శాఖ అధికారులు
- వరి పంటను, ధాన్యాన్ని కాపాడుకునే పనిలో రైతులు

మిచాంగ్ తుపాను ప్రభావం తీర ప్రాంతాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఈదురు గాలులతో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మంగళవారం బాపట్ల, నిజాంపట్నం మధ్య తుపాను తీరం దాటనుందని వాతావరణ శాఖ తెలపడంతో.. అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. సుడిగాలి పర్యటనలతో పంటల పరిశీలన, పునరావాస కేంద్రాలకు ప్రజల తరలింపు, సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. రైతులు సురక్షిత ప్రాంతాలకు వరిధాన్యాన్ని తరలిస్తున్నారు.

రేపల్లె రూరల్: మిచాంగ్ తుపాను బాపట్ల, నిజాంపట్నంలో తీరందాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఆదేశాలు జారీ చేసింది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో గాలలు వీచే ప్రమాదం ఉండటంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ఇప్పటికే ముందస్తు చర్యలు చేపట్టారు. గాలులల ప్రభావంతో చెట్లు, విద్యుత్ పోల్స్ విరిగిపడినా తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన యంత్రాలను సిద్ధం చేశారు. అధికారుల సూచనలకు ప్రజలు సహకరించాలని కోరుతున్నారు.

పునరావాస కేంద్రాలకు తరలించేందుకు..

రేపల్లె మండలంలోని పలు గ్రామాల్లో పూరిగుడిసెలు, కాల్వ కట్టలు, కచ్చా గృహాల్లో, నదీ, సముద్ర తీర ప్రాంతాలలో నివాసం ఉండే ప్రజలను అప్రమత్తం చేసి పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. మచిలీపట్నం, బాపట్ల, నిజాంపట్నం తదితర ప్రాంతాల్లో తుపాను తీరం దాటవచ్చన్న సమాచారంతో ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు ఆదేశాలతో అధికారులు మండలంలోని గ్రామాలకు చేరుకుని ప్రజలకు తుఫాను హెచ్చరికలు జారీచేశారు. తహసీల్దార్ డి.మల్లికార్జునరావు, ఎంపీడీవో శివపార్వతి, ఏవో వాగోలు బుష్ ఇతర శాఖల అధికారులు గ్రామాల్లో పర్యటించారు. ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు.

గ్రామస్థాయి అధికారులకు ఆదేశాలు..

గ్రామాల్లో నియమించిన అధికారులు అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉండి, పునరావాస కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని తహసీల్దారు మల్లికార్జునరావు ఆదేశించారు. పునరావాస కేంద్రాల వద్ద పారిశుద్ధ్యం లోపించకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఒక ఏఎన్ఎంతో పాటు అవసరమైన ముందులను అందుబాటులో ఉంచటం జరిగిందన్నారు. ఆయా గ్రామాలలో ఎటువంటి సహాయం అవసరమైన ఉన్నతాధికారులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. అదేవిధంగా గ్రామాల పరిస్థితులను సైతం ఎప్పటికప్పుడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని చెప్పారు. తడిచిన స్తంభాలు, మోటార్లను ముట్టుకోవద్దని హెచ్చరించారు. ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడితే తక్షణమే విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో సోమవారం ఉదయం వరకు రేపల్లెలో 6.6మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదవ్వగా చెరుకుపల్లిలో 2.2 మి.మీ., నిజాంపట్నంలో 2.8 మి.మీ., నగరంలో 4.6మి.మీటర్ల వర్షపాతం నమోదయ్యింది.



పెనుమడి పునరావాస కేంద్రంలో ఆహారం పంపిణీని పర్యవేక్షిస్తున్న తహసీల్దార్, కమిషనర్



తుమ్మలపల్లిలో పునరావాస ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో రవీందర్



అమర్తలూరులో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు



రేపల్లె రూరల్: చెన్నుపల్లివారిపాలెంలో నేలవాలిన పైరును కాపాడుకునే పనిలో రైతు

■ భట్టిప్రోలు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ దారా రవికిరణ్మయి సహాయక చర్యలపై చర్చించారు. ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, దిశా నిర్దేశం చేశారు. పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, వైఎస్సార్ సీపీ నాయకులు దారా చెన్నయ్య, పీజీ అరుణ్‌శాస్త్రి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

■ పిట్టలవానిపాలెం: మండలంలోని అల్లూరు, ఖాజీపాలెం, భవనంవారిపాలెం, చందోలు గ్రామాలలో వీఆర్వోలు పర్యటించారు. తుపాను తీవ్రత అధికమైతే పునరావాస కేంద్రాలకు రావాల్సిందిగా.. ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులతో కలిసి వరి పొలాలను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేస్తున్నారు.

కర్లపాలెం: మిచాంగ్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో తీర ప్రాంతంలో ఉన్న అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి దాసరి రాంబాబు సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తీర ప్రాంత గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించి ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలందరూ అప్రమత్తంగా తమ పశువులను కాపాడుకుంటూ తమ ప్రాణాలను రక్షించుకోవాలని చెప్పారు.

పునరావాస కేంద్రాలకు తరలించాలి..

కర్లపాలెం: మిచాంగ్ తుపాను ప్రమాదం పొంచి ఉన్నందున తీర ప్రాంతం ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని ఆర్డీవో జి.రవీందర్ ఆదేశించారు. తహసీల్దార్ కేశవనారాయణరావుతో కలసి సోమవారం రాత్రి తీరప్రాంత గ్రామాలైన పేరలి, తుమ్మలపల్లి, పెదపులుగువారిపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించి, ప్రజలకు అవగాహన కల్పించారు. పేరలిలో 15కుటుంబాలకు చెందిన 45మందిని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించామని, భోజనం, వసతులు కల్పించామని చెప్పారు. పెదపులుగువారిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామని తుమ్మలపల్లి, చినపులుగువారిపాలెం గ్రామాలలో ఉన్న తుపాను రక్షణ భవనాల్లో అవసరం మేరకు ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శివయ్య, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలో 12,500 ఎకరాల్లో వరి పంట కోతకు సిద్ధంగాగా ఉంది. మిచాంగ్ తుపాను ప్రభావంతో గాలులతో కూడిన వర్షాలకు..4,500 ఎకరాల్లో పంట పడిపోయిందని మండల వ్యవసాయాధికారి తెలిపారు. ఐదు వేల ఎకరాల్లో హార్వెస్ట్ యంత్రాల ద్వారా కోరి కోతలు పూర్తయినట్లు వివరించారు.

అమర్తలూరు(వేమూరు): వర్షాలకు తడిసిపోయిన పొలాల్లోని వరి ఓదెలను మండల వ్యవసాయాధికారి లోకేశ్వరి పరిశీలించారు. అమర్తలూరు మండలంలో 1200ల ఎకరాల వరి పంట ఒదేలపై ఉందని ఆమె తెలిపారు. రైతులను అప్రమత్తం చేశారు.

■ పిట్టలవానిపాలెం: ఎంపీపీ షేక్ బాజీ, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్‌లు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. తుపాను కారణంగా నేలకొరిగిన వరి పంట పొలాలను పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఏఈ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తూ చర్యలు తీసుకున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కాల్ సెంటర్లు

భట్టిప్రోలు: మిచాంగ్ తుపాను నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులకు అత్యవసర సేవలు అందించేందుకు ప్రత్యేక కాల్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు రేపల్లె విద్యుత్ శాఖ ఏడీఏ ఎస్.భాస్కరరావు తెలిపారు. తీర ప్రాంత మండలాల ప్రజలు అత్యవసర సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. ఆయా ఫోన్ నంబర్లు 24 గంటలు పని చేస్తాయని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే.. వెంటనే పునరుద్ధరించేందుకు అన్ని విద్యుత్ సబ్ స్టేషన్లలో సామగ్రిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

భట్టిప్రోలు	: 94906 15539
కొల్లూరు	: 94906 15530
గంగడిపాలెె	: 94906 15538
రేపల్లె	: 94906 15536
లంకెవానిదిబ్బ	: 85006 26842

రైతులకు సూచనలు

భట్టిప్రోలు: భారీ వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖాధికారి గొల్లపోతు మీరయ్య సూచించారు. వరి పంటను కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పనలు తడిచినట్లయితే 100 లీటర్ల నీటికి 5 కిలోల కల్లు ఉప్పు పిచికారీ చేయాలని సూచించారు. కుప్పలు వేసే సమయంలో తడిస్తే ఎకరా కుప్పకు 10 కిలోల కల్లు ఉప్పు వేయాలని.. ఇలా చేస్తే ధాన్యం మొలకెత్తకుండా ఉంటుందని వివరించారు.

అధికారుల సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి హనుమంతరావు

భట్టిప్రోలు: హార్వెస్టర్ల ద్వారా వరి కోత చేపట్టిన రైతులు ధాన్యాన్ని మిల్లర్ల వద్దకు చేర్చేందుకు వ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు ఆదేశించారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో అధికారులతో మిచాంగ్ తుపాను నేపథ్యంలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై ఆయన సమీక్షించారు. పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ శాఖాధికారులకు సూచించారు. రవాణా సౌకర్యానికి ఇబ్బంది లేకుండా ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖాధికారులు రహదారులపై చెట్లు పడితే తొలగించాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను తరలించేటప్పుడు పశువులు, గొర్రెలు, మేకలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, అత్యవసరమైతే మందులు కూడా అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని సూరేపల్లి, పల్లెకోన, వేమవరం వద్ద ఉన్న హైవే ప్రాంతాలోని వరి పంటను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జి. చంద్రశేఖరరావు, ఎస్ఐ అంబటి చంద్రశేఖర్, వైద్యాధికారిణి సీహెచ్ రామలక్ష్మి, ఈవోపీఆర్డీ టి. ఊహారాణి, పశు వైద్యాధికారిణి బి. లక్ష్మి రంజిత, ఏఓ జి. మీరయ్య, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు కె.రవిబాబు, శేతు రామచంద్రరరావు, శివకృష్ణ ఉన్నారు.

వరికి ముప్పు..రైతులు అప్రమత్తం



కొల్లూరు గ్యాస్ గోడౌన్ వద్ద పొలంలో టార్పాలిన్‌లతో కప్పి ఉంచిన వడ్ల బస్తాలు



వర్షం తెరిపివ్వడంతో పొలం నుంచి వడ్ల బస్తాలు తరలిస్తున్న రైతు కూలీలు

కొల్లూరు: మిచాంగ్ తుపాను రైతాంగంపై తీవ్ర ప్రభావం చూపనుంది. తుపాను ప్రభావంతో సోమవారం నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తుండటంతో వరి, మినుము పంటలు సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కోత దశకు వచ్చిన సమయంలో పంట కోల్పోవాల్సి వస్తుందన్న ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది. కొల్లూరు మండలంలో 12 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేపట్టగా గత పది రోజుల నుంచి కోతలు ఊపందుకున్నాయి. ప్రభుత్వం తుపాను తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు రైతాంగాన్ని అప్రమత్తం చేయడంతో వరి కోతలు పూర్తి చేసిన రైతులు పచ్చి మీదే వడ్లను అమ్మకాలు జరిపి, పంటను కాపాడుకోగలిగారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

పిట్టలవానిపాలెం: దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా అల్లూరు బుడే సాహెబ్ మెమోరియల్ సొసైటీ వ్యవస్థాపకుడు ఫజుల్ రెహమాన్, ఎంపీపీ షేక్ బాజి 150 మంది దివ్యాంగులు, అనాథలు, నిరుపేదలకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని నిర్వహించారు. అలకాపురం సర్పంచ్ మంతెన గంగరాజు, అల్లూరు నరసింహస్వామి దేవస్థానం చైర్మన్ వాలా శివారెడ్డి, సొసైటీ సభ్యుడు శ్రీనివాసరావు ఉన్నారు.

దివ్యాంగులు ఐకమత్యంగా ఉండాలి

బుద్ధాం(కర్లపాలెం): దివ్యాంగులందరూ ఐకమత్యంగా ఉండి, తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బీసీ బడుగు బలహీన వర్గాల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఉప్పాల మురళి అన్నారు. బుద్ధాం గ్రామంలో జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు రమేష్, ఆదిశేషు, వెంకటరెడ్డి, కొండలు, బాపిరాజు తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు అధిక ప్రాధాన్యం

ఇంటూరు(వేమూరు): ప్రభుత్వం దివ్యాంగులకు అధిక ప్రాధాన్యం కల్పిస్తోందని నేషనల్ దివ్యాంగుల పరిరక్షణ ఉపాధ్యక్షుడు షేక్ దస్తగిరి అన్నారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు వ్యవసాయ సహకారం సంఘం కార్యాలయంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సోమవారం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు కాజా బాల శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బొట్టు మోషే, దాసరి మోహన్ పాల్గొన్నారు.

కత్తి శ్రీనివాసరావుకు ఉత్తమ ఎన్‌సీసీ సేవ పురస్కారం

బాపట్ల: ఎన్‌సీసీ ఉత్తమ పురస్కారాన్ని బాపట్ల ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ కత్తి శ్రీనివాసరావు సోమవారం అందుకున్నారు. 22వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ తెనాలి కార్యాలయంలో కల్నల్ ఉమాశంకర్ చేతులమీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఎన్‌సీసీలో విశేష సేవలు అందించినందుకు శ్రీనివాసరావును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న లెఫ్టినెంట్ కె.మహేష్‌ను సన్మానించారు.



పురస్కారాన్ని అందుకుంటున్న శ్రీనివాసరావు

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

రేపల్లె: పట్టణంలోని వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌లో ఫిల్టర్ బెడ్‌ల నిర్వహణ పనులు జరుగుతున్న నేపథ్యంలో వారం రోజుల పాటు తాగునీటి సరఫరా తక్కువగా ఉంటుందని మునిసిపల్ కమిషనర్ విజయసారథి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుర ప్రజలు గమనించి, సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

మత్స్యకారులకు దుప్పట్లు పంపిణీ



బాపట్ల: తీరప్రాంత ప్రజలకు ఎస్ టు నీడ్స్ సంస్థ సోమవారం దుప్పట్లు పంపిణీ చేసింది. మత్స్యకార గ్రామాల్లో సంస్థ డైరెక్టర్ తోట సురేష్‌బాబు దుప్పట్లు, ఆహార పదార్థాలను అందించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు శివగంగు, చేలూరి మనేమ్మ, చోడిపల్లి అప్పలనరసమ్మ, బొంది కొండమ్మ పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

వేటపాలెం(వేమూరు): గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలెం రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చుండూరు మండలం వేటపాలెం గ్రామంలోని బెయేర్షబా పార్థన మందిరంలో శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆధార్ కార్డు తీసుకొని రావాలని పేర్కొన్నారు.

కార్తిక మాసం ప్రత్యేక పూజలు



భట్టిప్రోలు: కార్తిక మాసం మూడవ సోమవారం భట్టిప్రోలులోని శివాలయాల్లో విశేష పూజలు జరిగాయి. పెదపులివర్రు రాజరాజ నరేంద్ర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. విశలేశ్వర స్వామి, హేమ విశలేశ్వరస్వామి, భ్రమరాంబ మల్లేశ్వరస్వామి, ఐలవరం రామలింగేశ్వర స్వామి, వెల్లటూరు అగస్తేశ్వరస్వామి ఇలా పలు దేవాలయాల్లో అభిషేకాలు జరిగాయి. భక్తులు స్వామిని దర్శించుకుని, దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమన్వయంతో అభివృద్ధికి పాటుపడాలి



కొల్లూరు: ప్రజా ప్రతినిధులు అడిగిన అంశాలపై సరిగా స్పందించక పోవడంతో వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివిధ శాఖల పనితీరుపై సమీక్ష జరుగుతుండగా.. పంచాయతీ రాజ్ ఏఈ సేవానాయక్‌ను సభ్యులు అభివృద్ధి పనులు, జగనన్న కాలనీల్లో రహదారుల నిర్మాణాలపై ప్రశ్నించారు. దీనిపై ఏఈ సమాధానం దాటవేత ధోరణిని అవలంభించడంతో.. వైస్ ఎంపీపీ రాంబాబు అంతర్గత రహదారుల అంచనాలపై వివరణ ఇవ్వాలని కోరారు. దీనితో సహనం కోల్పోయిన ఏఈ ప్రజాప్రతినిధులపై అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ సత్యనారాయణరావు కలుగజేసుకుని రహదారుల నిర్మాణానికి ఎంత మొత్తానికి ప్రతిపాదనలు ఇవ్వాలో తెలపాలని కోరడంతో..రూ.35 లక్షలకు ఇవ్వాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు అడిగితే సమాధానం ఇవ్వకపోవడంపై వారు అసహనం వ్యక్తం చేశారు. అనంతరం పలువురు సభ్యులు మండలంలోని సమస్యలను పరిష్కరించాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా పనిచేయాలని సూచించారు. తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.